# యౌవనంలో వార్ధక్యం

సి. ధర్మారావు

రామ్మూర్తి మధ్యాహ్నం నిద్రనించి మత్తుగా లేచాడు. గడియారంవంక చూస్తూ రెండు నిముషాల్లో టైమెంతయిందో తెలుసుకున్నాడు. ఒంటిగంటన్నర. మిగతారోజంతా ఏంచెయ్యాలి? ఉదయం హక్స్‌లీ పుస్తకము చదువుతూ నిద్రపోయాడు. అది వ్యాసాల సంపుటి. అందులో ఆఖరి వ్యాసము మానవజాతియొక్క రెండు శత్రువుల్ని గూర్చి. అవి హక్స్‌లీదృష్టిలో పెరిగిపోతున్న జనాభా, తరిగిపోతున్న భూసారం. సరిగా ఎవ్వరూ గుర్తించని- గుర్తించినా తగు చర్యతీసుకోని, ఈ సమస్యల్ని గూర్చి, వాటి భవిష్యత్పరిణామ, ప్రభావాల్నిగూర్చి హక్స్‌లీ చాలా భయంకరంగా వర్ణించాడు. ఇంకా కొద్ది సంవత్సరాల్లో భూమి ఇలాగే వూరుకుంటే ఏమీ పండని స్థితి కొచ్చేస్తుందన్నాడు. భూగర్భంలో దొరికే ఖనిజాలు, పెట్రోలు మొదలైనవి అయిపోయే 'స్టేజి' ఒకటి వస్తుందిగదా అన్నాడు. జనాభా ఇప్పుడు పెరుగుతున్న పద్ధతిని 1980 ప్రాంతానికి 300 కోట్లకొచ్చేస్తుందట. తరువాత కొంతకాలానికి తిండివుండక హడిలిచస్తారు మనుషులు, అంటాడు. నిజమే మరి. అన్నీ "ఫిగర్సు!"...

పాశ్చాత్యులు! కాని ఎంతెంత మేధావులు వున్నారు వాళ్ళలో! చకచకా 'మెటీరియలిజమ్' అంతుచూసిందీ వాళ్ళే, మళ్ళీ అది మనిషిని అన్నివిధాలా సంతుష్టుణ్ణి చెయ్యలేదనీ, కాబట్టి అధోగతేననీ గమనించి హెచ్చరించిందీ వాళ్ళే. ఏంలాభం? మేధావులుండగానే సరా? అన్నీ తెలిసికూడా మూఢోమారణ హోమానికి తయారవుతున్నారు. మానవస్వేచ్ఛ, స్వాతంత్ర్యము మొదలైన మహోన్నత సిద్ధాంతాలకోసమే ఈ హోమమనే వీళ్లు, యుద్ధంలో ఎన్నెన్నోకోట్ల జనాభాని హతమార్చటంలో వీళ్ళు కోల్పోయే సామాన్య మానవత్వ సిద్ధాంతాన్ని గురించి ఆలోచించరేం? రెండువందలకోట్లమంది స్వేచ్ఛకోసం ఒకకోటిమంది మాత్రం ఎందుకు చావాలి? ప్రతి వ్యక్తీ ఒక complete entity అనిగదా? ఇంకొకడికోసం వీడు, జీతం తీసుకున్నందుకుగాను జీవితం ఎందుకు వదులుకోవాలి?

ఇలా సాగిపోతున్న రామ్మూర్తి ఆలోచనకి శ్రీరాములు అడ్డుతగిలాడు.

"బాబూ!"

"ఎవరూ, శ్రీరాములూ? లోపలికిరా."

"ఆరెంజి కావాలో, పైనాపులు కావాలో అమ్మ కనుక్కురమ్మన్నారు బాబూ!"

"ఏం, పాలేమైనయ్?"

"విరిగిపోయినాయంట బాబూ!" ఒక్క క్షణంసేపు ఆలోచించాడు రామ్మూర్తి.

"ఏంవద్దని చెప్పు అమ్మతో." శ్రీరాములు అమ్మతో చెప్పటానికి వెళ్ళలేదు. నిలబడేవున్నాడు.

"నేను టౌనుకెళ్తున్నానని చెప్పు." శ్రీరాములు వెళ్లిపోయాడు.

డ్రెస్ చేసుకుని రామ్మూర్తి రోడ్డువైపు బయలుదేరాడు. నవ్వొచ్చిందతనికి. ఏం తోచక తనిప్పుడు టౌనుకు బయలుదేరడం! జీవితం ఎలా గడుస్తుంది ముమ్ముందునకిలా? ఏమో! నాన్నుంటే ఏదో చెప్పేవాడు, తనేదో చేసేవాడు, ఈ బాధ లేకుండాపోయేది... అమ్మ పెళ్ళిచేసుకోమని గోలపెడుతుంది. కాలక్షేపానికి పెళ్ళామా, రేడియోలా? తనకి నవ్వాలో, ఏడవాలో తెలియదు ఆ ఆలోచన వచ్చినప్పుడు. మొత్తానికి పెళ్ళంటే విముఖంగా వుందతనికి. మరి అసలే చేసుకోకపోవటమా? నిజమే. తనెన్నడూ ఆలోచించనేలేదు! ఇప్పటి జీవితక్రమాన్ని, ఆలోచనల్ని, అలవాట్లనీ తల్లకిందులుచేసే సంఘటనేదో జరిగితేతప్ప పెళ్ళి సామాన్యంగా చేసుకోగూడదనివుంది తనకి.

ఈపాటికి రామ్మూర్తి రోడ్డుమీదకొచ్చేడు. ఇతన్నిచూసి అక్కడున్న ఒకేఒక్కడు రిక్షా

తెచ్చాడు. రామ్మూర్తి రిక్షా ఎక్కాడో లేదో వెనకాల సిటీ బస్సు హారన్ వినిపించింది.

"రిక్షా ఆపవోయ్" అన్నాడు రామ్మూర్తి.

"ఏం బాబు?"

"సిటీబస్సుకెళ్తానోయ్, ఇవిగో డబ్బులు"

"అక్కర్నేదు, ఎల్లండి బాబూ!"

రామ్మూర్తి నవ్వాడు. "తీసుకో, కాస్త తొందరపనుండి వెళ్తున్నాను. మరి న్యాయంగా నీ బేరంగదా" అబద్ధమాడాడు రామ్మూర్తి. ఎండలో వాణ్ణి చంపడమెందుకు? అని రామ్మూర్తి వుద్దేశ్యం.

"యెల్లండిబాబూ ఫర్నేదు, మీదయుంటే అంతే శాన."

రామ్మూర్తికి కోపమొచ్చింది. యేమిటీ వెధవ ప్రిన్సిపుల్స్?

"తీసుకోవోయ్, చెప్తుంటే కాస్త తెలుసుకోవాలి."

"కోప్పడకండి బాబయ్యా, ఇంకోసారి రారా బాబులు? కష్టం శెయ్యకుండా..."

రిక్షావాడి మాట పూర్తికాకముందే డబ్బులు రిక్షా సీటుమీదికి విసిరేసి గబగబా బస్సువద్దకు వెళ్ళాడు రామ్మూర్తి. బస్సు కదలబోతోంది. తనముందు ఇద్దర్నికూడా దించేశాడు కండక్టరు ఖాళీలేదని. ఏంచెయ్యాలో తెలియక త్రిశంకు స్వర్గంలోంచి ఒక్కనవ్వు నవ్వాడు రామ్మూర్తి. అయినా మళ్ళా రిక్షాని పిలవటం యిష్టంలేదతనికి. వాడికి కనపడకుండా రోడ్డుపక్క చెట్టుకింద రెండోబస్సు వచ్చేవరకూ కూర్చుని ఆ బస్సు యెక్కాడు రామ్మూర్తి. అతని తర్వాత ఇంకా చాలామంది ఎక్కారు. కొంతమంది నిలబడ్డారు. ముందుగా నిలబడ్డది ఇంకో యువకుడు. అతన్ని ఉద్దేశించి "ఆసీట్లో కూర్చోండి, ఖాళీవుందిగా" అన్నాడు మరో సీట్లో ఆయన. ఆయన చూపింది ఆడవాళ్ళ సీట్లో ఖాళీ. ఈ చివరగా ఒకమ్మాయి కూర్చునుంది. ఆ ప్రక్కన కూర్చోటానికి మొహమాటపడ్డ ఆ యువకుడు విననట్టు నటించాడు. కాని ఆ పెద్దమనిషి మళ్ళీ గట్టిగా చెప్పాడు. యువకుడికి వినిపించుకోక తప్పలేదు.

"ఆడవాళ్ళ ప్రక్కనెందుకులెండి, కాసేపు నిలబడతాను."

"బస్సులో అట్లా అనుకుంటే ఎట్లా? అయినా చిన్నపిల్ల."

బస్సుదిగి రామ్మూర్తి హోటలులో ప్రవేశించి టిఫిను, కాఫీ తీసుకున్నాడు. బిల్లు ఏడణాలు. రూపాయిచ్చి చిల్లర తీసుకుని హోటలు మెట్ల వరకూ వచ్చి పర్సులో వేసుకోబోతూ చూశాడు. అర్థరూపాయే వుంది. అణా అడుగుదామని రామ్మూర్తి వెనక్కి తిరిగాడు. కౌంటరువద్ద వత్తిడిగా వుంది. వాళ్ళందరిలోకి వెళ్లి "ఏమండీ ఒక అణా తక్కువిచ్చారండీ" అని తననటం, వాడు వివరాలు అడగటం, వాళ్ళంతా చూడటం ఇదంతా న్యూసెన్సుగా తోచి రోడ్డునపడ్డాడు రామ్మూర్తి. ఆ అణా అక్కడ వదలెయ్యడం తన బలహీనతేమో అనుకున్నాడు. ఏమైనా ఇందాకావచ్చి మళ్ళీ వెళ్ళటం అసాధ్యం! గడియారం వంక చూశాడు. మూడుంపావు. ఎక్కడికెళ్ళాలి? టింబరుడిపోలో పనిచేస్తున్న స్నేహితుడు సుబ్బారావు జ్ఞాపకం వచ్చాడు. ఆ డిపోకి అక్కడేవో రెండుమూడు గొందుల్లోగుండా వెళ్ళాలి. ఆ సందుల్లోకి మళ్ళీ రెండుమూడు ఫర్లాంగులు అటు ఇటూ తిరిగి ఏవేవో బజార్లలోకి వెళ్ళి చుట్టూ చూశాడు. పరిసరాలు గలీజుగా వున్నయ్. ఏదో శక్తినిబద్ధుల్లాగ అక్కడక్కడ మనుషులు సంచరిస్తున్నారు. ఆ వీధులు 'మినర్వా' టాకీసు పక్క వున్న చిల్లరపేటు ప్రాంతంగా గుర్తించాడు. అక్కడినుండి మెయిన్‌రోడ్డుకుపోయేవీధిని నడక సాగించాడు. అతనికి ముందరగా కొద్దిదూరంలో ఒక పాక ప్రక్క గుంపాకటి చేరివుంది. ఏదో దెబ్బలాటయ్యాక ఎటువారటు సర్దుకుంటున్న వాతావరణం వుందక్కడ. రామ్మూర్తి ఆ దగ్గరలోకి వెళ్ళేప్పటికి ఇహ మిగిలివున్న ముగ్గురు నలుగురూ పాకలోకి వెళ్ళారు. అదొక చిన్న కాఫీ హోటలు. ముందొక ఎత్తుబల్లా, పక్కల మూడు నాల్గు బెంచీలు వున్నాయ్.

"అంతా వెళ్లిపోయారుగాని అసలేం జరిగిందో చెప్పవయ్యా" అంటున్నాడు లావుగా బొద్దుగా వున్న ఒకాయన. పాక మధ్యవున్న స్తంభాని కానుకొని ముడుచుకు కూర్చున్న మరొకడితో. అతను చాలా ఆందోళనగాను, కంగారుగాను వున్నాడు. బట్టలు బాగానే వున్నా, క్రాఫంతా

చెదిరి మొహం వాడిపోయివుంది. రామూర్తి పెద్ద ఆలోచన లేకుండానే పక్కకి వెళ్లి బెంచీమీద కూర్చున్నాడు. అందరూ అతనివంకే చూశారు గాని "ఏంకావాలి?" అని ఎవరూ అడగలేదు. ఆ బొద్దుగావున్నా వ్యక్తి హోటలు యజమాని అయివుంటాడు. మిగతా ఇద్దరు ముగ్గురూ ఆత్రుతతో ఆకింద కూర్చున్న మనిషి వంక చూస్తున్నాడు. అతని పెదవులు వణుకుతున్నాయ్. నట్టుతూ నసుగుతూ అతను చెప్పాక పోయ్యాడు.

ధోరణి గమనించిన రామ్మూర్తి మెయిన్ రోడ్డు మీదుగానడక సాగించాడు. ఆలోచిస్తున్న రామ్మూర్తికి రోడ్డుమీద అకస్మాత్తుగా అతను-శంకర్రావు-తగిలాడు. శంకర్రావ్ నగానే ఏదో మెరుపులా పడతాడు. అతనే మెరుపు. తను బి. యే. క్లాసులో వున్నప్పుడు అతను జూనియరు. కాలేజీలో అతను పాల్గొనని 'యాక్టవిటీ' లేదు. అన్నిటిలోనూ ఫస్టు. ఎక్కువ మాట్లాడేవాడు కాదు. ఎప్పుడైనా మాట్లాడితే చాలామందికి అర్థమయ్యేది కాదు, కొంతమందికి అర్థమైనా జ్ఞాపక ముండేది కాదు. అతనొక చిత్రమైనమనిషి. పెద్దగా చదివేవాడు కాదు, మార్కు లద్భుతంగా వచ్చేవి. అందరికీ అతనంటే ఆకర్షణ. తనలాంటి కొద్దిమందికిమాత్రం ఎంత ఆకర్షణో అంత విముఖత్వము, భయము. ఒకే ఒకే ఒక్కసారి తను అతనితో సంభాషణలోకి దిగాడు. 'కళ' అనేది 'ఫార్సు'నీ దానికి శాశ్వతమైన విలువలు లేవనీ అందువల్ల దానికి అస్తిత్వమే లేదనీ ఇంకా ఏమిటేమిటో అన్నాడు. అప్పుడేమిటో తన కర్థమైనట్టే వుంది. తనేమీ మాట్లాడలేకపోయాడు.

శంకర్రావు తనను చూసి నవ్వి గబగబా సమీపించాడు. అతని ముందు కుశలప్రశ్నాదికము లేమీవుండవు. అతను రామ్మూర్తిని "ఏం చేస్తున్నారు" అని అడగలేదు. రామ్మూర్తే అడిగాడు.

"ఎయిర్ ఫోర్సులో జాయింట్ సర్వీసెస్ వింగ్ లో సెలక్టయ్యాను. జీతమెంతో అడుగుతా రనుకుంటాను. నాలుగొందలిస్తున్నారు" అన్నాడు. రామ్మూర్తికా ధోరణి చికాకేసింది.

"పెళ్ళి చేసుకున్నారా?" అని అడిగాడు.

"చేసుకోలేదు, ఎప్పటికీ చేసుకోను కూడా."

"ఏం, అంత త్వరగా ఎలా రాగలిగారు ఆ నిర్ణయానికి?" శంకర్రావు నవ్వాడు. "నాకే తెలియదు. మీకేం చెప్పమంటారు?"

రామ్మూర్తి కేం తోచలేదు. కాస్సేపాగి అన్నాడు.

"తలవెంట్రుకలు నెరిసిపోతున్నయ్యే?"

"ముసలివాణ్ణవుతున్నా నంటారా? ఆ భయం లేదు. ముసలివాళ్లు రెండు రకాలు. వయసుచేత అయ్యేవాళ్ళు, లేక ప్రతిదాన్నిగూర్చి ఆలోచించే వాళ్లు; ఒకళ్ళెప్పుడూ భూతకాలంలో వుంటారు, మరొకళ్ళెప్పుడూ భవిష్యత్తులో వుంటారు. ఇద్దరూ సమానంగా నిరర్థకులే, సమానంగా చచ్చువాళ్ళే" అన్నాడు శంకర్రావు.

అని కాస్సేపాగి మళ్ళీ అన్నాడు.

"జలపాతంలాంటిది యౌవనం. అందులో ఆలోచనకి తావేలేదు. ప్రతిదాన్ని గూర్చి ఆలోచించాల్సి రావటం యౌవనంలో ఎంత దురదృష్టం!" రామ్మూర్తి కీమాటలు ములుకుల్లా తగిలినయ్. మాటలయ్యేంతవరకూ వుక్కిరిబిక్కిరై గిలగిలా కొట్టుకులాడిపోయినంత బాధపడ్డాడు. ఇహక్కడ ఒక్క క్షణం కూడా నిలవలేక పోయాడు. శంకర్రావు సెలాగో వదిలి గబగబా సిటీ బస్సువేపుకు వెళ్ళాడు. దారి పొడుగునా శంకర్రా వన్నమాటలు చెవుల్లో గింగుర్లెత్తుతున్నయ్. ఆ మాటలు తననంత అమానుషంగా హింసిస్తున్నయ్యేమిటి? శంకర్రావు తన సంగతంతా తెలిసి కావాలనే ఆ మాటలన్నాడా? నిజము గనకనే వాటిలో నిశితత్వాన్ని తనంతగా "ఫీ"లవుతున్నాడా?

సిటీబస్సుదిగి తన 'రూము'లోకొచ్చి మంచమ్మీదపడ్డాడు రామ్మూర్తి. అవే మాటలు, అవే శంకర్రావు! శ్రీరాములువచ్చి లైటెలిగిస్తున్నాడు.

"శ్రీరాములూ! ముందు వెంటనే బయటికెళ్ళిపో" శ్రీరాములు వున్న పాటిగా కొయ్యబారిపోయాడు. లేచి బయటికెళ్ళిపోతున్నాడు. కాస్సేపటికి—

"తలుపులూ, కిటికీలూ మూసెయ్, మళ్ళీ తెరవకు" శ్రీరాములు భయంతో వణికిపోయాడు.

రామ్మూర్తి మళ్ళీ "సీరియస్"గా ఆలోచించటం మొదలుపెట్టాడు. ★